# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శుక్రవారం ၊ 12 ၊ జూలై ၊ 2024






### విత్తన చట్టంతో..మోసాలకు కళ్లెం

విత్తనాలు, కొనుగోలు సమయంలో రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా విత్తన చట్టం ద్వారా డీలర్లపై కఠిన చర్యలు చేపడతారు.

-8లో



### ఆ కార్యాలయంలో ఆయనదే హవా

మదనపల్లె మండల రెవెన్యూ కార్యాలయంలో గతంలో ఉప తహసీల్దార్‌గా పనిచేసిన ఓ విశ్రాంత అధికారి పౌరసరఫరాల విభాగంలో నేడు చక్రం తిప్పుతున్నాడు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.550 | రూ.640 |
| రెండోరకం | రూ.410 | రూ.540 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 941 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 435 | 492 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 770.600 కిలోలు


### డబ్బులు ఎప్పుడొస్తాయో..



నా పేరు హుస్సేన్‌బీ. మాది వీరపునాయునిపల్లె ఉరుటూరు గ్రామం. కూలి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు 8వతరగతి, మరొకడు 10వ తరగతి చదువుతున్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద ఒకొక్కరికి 15వేల రూపాయలు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. పాఠశాలలు తెరిచి దాదాపు నెలరోజులు కావస్తున్నా ఇంతవరకు ఇవ్వలేదు. పాఠశాలల్లో ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. 'తల్లికి వందనం' డబ్బులు వస్తాయో ఏమో..







'అమ్మ ఒడి పథకంలో సమూల మార్పులు తీసుకువస్తాం. ఎంతమంది విద్యార్థులంటే అందరికీ 'తల్లికి వందనం' పేరిట ద్వారా రూ.15వేలు చొప్పన చెల్లిస్తాం. ఇంట్లో ఇద్దరు పిల్లలుంటే రూ.30వేలు, ముగ్గురుంటే రూ.45వేలు చెల్లిస్తాం..'

-మే 2వ తేదీన రాయచోటిలోని నేతాజి సర్కిల్‌లో చంద్రబాబు

# ఒక్కరికే వంధనం

- తల్లికి వందనంపై మాట మార్చిన బాబు
- తల్లి అకౌంట్‌లో రూ.15వేలే జమ చేసేలా జీఓ జారీ
- పైగా విద్యార్థికి 75శాతం హాజరు ఉంటేనే చెల్లింపు
- ప్రైవేటు పాఠశాలలో చదివే విద్యార్థులపై లభించని స్పష్టత

సీఎం చంద్రబాబు మరోసారి మాట తప్పారు. కాదు కాదు 'వందో'స్సారి 'లెక్క'తప్పారు. అధికారంలోకి వచ్చి సరిగ్గా నెలరోజులైనా కాకముందే తల్లులకు చుక్కలు చూపించారు. 'తల్లికి వందనం' పెట్టి.. పిల్లల చదువులకు బంధనం వేశారు. అర్ధరాత్రి జీవోలోని నిబంధనలు చూసిన తల్లిదండ్రులు మోసపోయామంటూ నోరెళ్లబెట్టారు. చెప్పిన మాట చెప్పినట్లుగా అమలు చేసిన చరిత్రే బాబుకు లేదంటూ కొందరు మండిపడుతున్నారు. "నేను మోనార్క్‌ని నన్నెవరూ మోసం చేయలేరు.. నేనే అందర్నీ మోసం చేస్తాన'న్న డైలాగ్ చంద్రబాబుకు సరిగ్గా సరిపోతుందని బాబు తీరును తూర్పారబడుతున్నారు.



సాక్షి ప్రతినిధి, కడప/బి.కొత్తకోట: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో చంద్రబాబు తన మార్కు రాజకీయం చేశారు. కూటమిగా జత కట్టారు. నోటికొచ్చిన హామీలు గుప్పించారు. మేనిఫెస్టోలోనే కాదు.. వెళ్లిన ప్రతి సభలోనూ అమ్మఒడి స్థానంలో తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది విద్యార్థులుంటే అందరికి ఏటా రూ.15వేలు ఇస్తానని మాటిచ్చారు. అందలమెక్కింది మొదలు మాట మారుస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఉచిత ఇసుకలో మోసం చేసిన బాబు.. తాజాగా తల్లికి వందనలోనూ మాట మార్చారు. ఇంట్లో ఒకరికే ఇస్తామంటూ నిలువునా మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలు పునఃప్రారంభమై విద్యా సంవత్సరం మొదలై నెల గడచిపోయింది. విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలకు ఫీజులు చెల్లించాల్సి ఉంది. రూ.15వేలు చొప్పున ఇంట్లోని పిల్లలందరికీ వర్తింపజేస్తామని చెప్పడంతో ఖాతాలకు నిధులు ఎప్పుడు జమ అవుతాయని తల్లిదండ్రులు నిరీక్షిస్తున్నారు.

**వైఎస్‌జగన్ పాలనలో రూ.కోట్ల లబ్ధి**

గత వైఎస్.జగన్ పాలనలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూశారు. అమ్మఒడి పథకాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఎలాంటి కొర్రీలు లేవు, నిబంధనలు లేవు. విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో పక్కాగా అమ్మఒడి అమలైంది.

- చంద్రబాబు హయాంలో మోసమే రాజ్యమేలుతోంది. అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి తాజాగా విడుదలైన జీవోలోని ఉత్తర్వులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జీవో ప్రకారం తల్లి ఖాతా, ఆధార్ సీడింగ్ చేయాలని ఆదేశించారు. 'ప్రతి తల్లి ఖాతా'కు రూ.15వేలు జమ చేయనున్నట్లు తెలిపారు. దీని ప్రకారం ఒక ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుందని భావిస్తే తప్పులో కాలేసినట్లే. చంద్రబాబు సర్కార్‌లో మరోమారు విద్యార్థుల తల్లిదండ్రులు వంచనకు గురయ్యారు. ఇక విద్యార్థికి 75శాతం హాజరుతోపాటు, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి వర్తింపు చేసేలా నిబంధనలు ఉండనే ఉన్నాయి.

**వైఎస్సార్ జిల్లాలో 3.32లక్షల మంది..**

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,32,224 మంది విద్యార్థులు ఉన్నారు. 2,064 ప్రభుత్వ, 781 ప్రైవేటు పాఠశాలల్లో వారంతా విద్యను అభ్యసిస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం టీడీపీ ప్రభుత్వం వీరందరికీ రూ.15వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. నిబంధనలు పరిశీలిస్తే తల్లికి ఒక్కరికి మాత్రమే చెల్లించేలా ఉత్తర్వులు న్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న అమ్మ ఒడి పథకం నాన్న బుడ్డీకి సరిపోతుందని అప్పట్లో చంద్రబాబు ఎద్దేవా చేసేవారు. ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పేరిట వర్తింప జేస్తామని ప్రకటించారు. చెప్పిన మాట చెప్పినట్లుగా అమలు చేసిన చరిత్రే బాబుకు లేదు. నోటితో చెప్పేది ఒకటి, ఆచరణలో పెట్టేది మరొకటి. అదే చంద్రబాబు మార్క్ శైలి అని విశ్లేషకులు వివరిస్తున్నారు.

- అన్నమయ్య జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,734, ప్రాథమికోన్నత పాఠశాలలు 162, ఉన్నత పాఠశాలలు 304, జూనియర్ కళాశాలలు 136 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో 1,37,743 మంది. ప్రైవేటు పాఠశాలలో 1,08,538 మంది విద్యార్థులు చదువుతున్నారు.





వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమ్మఒడి పథకం ద్వారా చెల్లించిపుల వివరాలు

| సంవత్సరం | తల్లులసంఖ్య | జమచేసిన మొత్తం (కోట్లలో) |
|---|---|---|
| 2019-20(51 మండలాలు) | 2,55,587 | 383.38 |
| 2022-21(51 మండలాలు) | 2,68,076 | 402.11 |
| 2021-22(36 మండలాలు) | 1,87,742 | 281.61 |
| 2022-23(36 మండలాలు) | 1,80,203 | 270.30 |
| మొత్తం | 8,91,608 | 1337.40 |

**▶▶ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..**

పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశ్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్టాత్మంగా రూపొందించి అమలు చేసింది. ఇచ్చిన మాట ప్రకారం పాఠశాలలు ప్రారంభమైన వారం పది రోజుల్లో బడికి పంపే ప్రతి తల్లి ఖాతాకు రూ.15 వేలు నగదు జమ చేసేది. ఈ నిధులతో తల్లిదండ్రులు పిల్లలకు అవసమైన విద్యా సామగ్రిని కొనుగోలు చేసుకుని, ఫీజు డబ్బులు కూడా కొంత చెల్లించి వారి పిల్లలను నచ్చిన పాఠశాలకు సంతోషంగా పంపేవారు.

**▶▶ మాట మార్చిన టీడీపీ**

టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి పోతే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని చెప్పింది. ఆచరణలోకి వచ్చే సమయానికి ఒక్కరికి మాత్రమే నిధులు జమ చేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. పైగా తెల్లరేషన్ కార్డు హోల్డర్ మాత్రమే అర్హులు. ఇలాంటి నిబంధనలతో చాలా మంది విద్యార్థుల తల్లులు అర్హత కోల్పోయే అవకాశం ఉందని పలువురు వివరిస్తున్నారు.

### ఇంత ..మోసమా!



తల్లికి వందనం పథకం కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు వర్తింపజేయాలి. మోసం చేయడం సరికాదు. పేద కుటుంబానికి చెందిన మాకు ముగ్గురు కుమార్తెలు. కలసపాడులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ముగ్గురికి తల్లికి వందనం పథకం అమలు చేయాలి.

-బి.లక్షుమ్మ, సిద్దమూర్తిపల్లె, కలసపాడు

### మాట తప్పితే ఎలా బాబూ!



నాకు ఇద్దరు కుమారులు. పెద్ద అబ్బాయి సుమంత్ జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి, చిన్న అబ్బాయి సుశాంత్ శ్రీచైతన్య స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం కింద ఇద్దరికి రూ.30 వేలు వస్తుందనుకున్నాను. ఇప్పుడేమో ఇంట్లో ఒకరికే ఇస్తామని అంటున్నారు. అది కూడా ఇంత వరకు జమ చేయలేదు. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరోలా మాటమార్చడం సరైంది కాదు.

-చెప్పలిసునీత, రజకవీధి, బద్వేలు

### ఇవ్వకుంటే కష్టమవుతుంది..



నా పేరు షహజాద్ బేగం. జమ్మలమడుగు పట్టణంలోని కన్నెలూరు. నాకు ఒక కుమార్తె, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నాను. పెద్దకుమారుడు మహమ్మద్ హనీఫ్ ఇంటర్మీడియట్, చిన్నోడు మహమ్మద్ రోషన్ ఆరోతరగతి చదువుకుంటున్నారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి 15వేల రూపాయలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీ ప్రకారం ఇద్దరికీ ఇవ్వాలి.

### పిల్లలను ఎలా చదివించాలి



బడులు తెరిచారు..క్లాసులు జరుగుతున్నాయి..ఇప్పుడు ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ఫీజుల కోసం ఒత్తిడి తెస్తున్నారు. మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురిని ప్రై వేటు స్కూల్‌లో చేర్పించాం.యాజమాన్యానికి ఫీజు చెల్లించాల్సి ఉంది. పల్లెలో టైలర్ పనితో వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. ఒక్కోసారి కూలిపనులే దిక్కు. చంద్రబాబునాయుడు పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. ఇంత వరకు డబ్బు ఖాతాలకు జమకాలేదు.పిల్లలను ఎలా చదివేంచేది.

-కవిత, అంగళ్లు, కురబలకోట మండలం

### ఇద్దరు పిల్లలకు ఇవ్వాలి



ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పన అందాల్సి ఉంది. ఇద్దరు పిల్లల్లో ఒకరు పెద్దమండ్యం ఉన్నత పాఠశాల, మరొకరు రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి ద్వారా పాఠశాలలు తెరవగానే నా ఖాతాకు రూ.13 వేలు నగదును జమ చేశారు.

- కె శిరీష, రెడ్డివారిపల్లె, పెద్దమండ్యం



నా పేరు జి.అరుణ. చిన్నమండెం మండలం కొత్తపల్లె గ్రామం. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం కుటుంబంలోని పిల్లలందరికీ తల్లికి వందనం అమలు చేయాలి. నేను, మా వారు గురునాథ వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకు బండి లాగిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. విజయకాంత్ 9వ తరగతి, వినోద్‌కుమార్ 7వ తరగతి చదువుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చెప్పిన విధంగా ఇద్దరికీ తల్లికి వందనం అమలుపరుస్తారనే ఉద్దేశంతో ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాం. కానీ తల్లికి సంబంధించి ఒకరికే 'తల్లికి వందనం'అమలుపరచాలనుకోవడం బాధాకరం.

### ఇది పచ్చి మోసం



చంద్రబాబు పచ్చి మోసం చేస్తున్నాడు. ఎన్నికలప్పుడు బడికిపోయే పిల్లలందరికి రూ.15 వేలు ఇస్తామని, ఇప్పుడేమో ఒకరికే అంటున్నాడు. మాకు ఇద్దరు పిల్లలు. చిన్నోడు 8, పెద్దోడు పదో తరగతి ప్రభుత్వ బడిలో చదువుతున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ. 30 వేలు వస్తుందని ఆశపడ్డా. మా వారు ఆటో తోలుతుంటాడు. ఆరోగ్యం బాగా లేనప్పుడు ఆటో తోలలేకపోతే ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పూట గడుపుకోవచ్చనుకున్నా. అయితే ఇప్పుడు చంద్రబాబు నిరుపేదలకు ఆశపెట్టి మోసం చేయడం న్యాయం కాదు.

- లక్ష్మీనరసమ్మ, సాతపల్లె, రాజంపేట

### చదువుపై ప్రభావం పడుతుంది



మాకు. భవ్య, పల్లవి, దివ్య అనే ముగ్గురు కుమార్తెలు. వ్యవసాయ కూలి పనులే జీవనాధారం. పెద్ద కుమార్తె కర్ణాటకలో, మిగిలిన ఇద్దరు మండలంలోని కందుకూరు ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల్లో చంద్రబాబు మీ ఇళ్లలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పన తల్లికి వందనం పథకం ద్వారా ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఒకరికే అంటున్నారు.చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా డబ్బు జమ చేయాలి.. లేదంటే పిల్లల చదువుపై ప్రభావం చూపుతుంది.

-పట్టెరిక మమత, పట్టింవాండ్లపల్లి, పెద్దతిప్పసముద్రం మండలం

## న్యూస్‌రీల్

### 13న సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

రాయచోటి టౌన్: జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు ఈ నెల 13వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీదేవి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ జేసునాథ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, సభ్యులు గంగులయ్య గురువారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. రాయచోటిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే ఎంపికలకు ఉమ్మడి వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన వారు హాజరు కావాలని చెప్పారు.

### కలెక్టర్ ఫొటో ఉన్న వాట్సాప్ నంబర్లతో జాగ్రత్తగా ఉండండి

రాయచోటి: తన ఫొటో ఉన్న వాట్సాప్ నంబర్లతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఫొటోతో ఉన్న ఒక ఫేక్ వాట్సాప్ నంబర్ నుంచి జిల్లాలో పనిచేస్తున్న కొంత మంది అధికారులకు, మెసేజ్‌లు వెళ్లినట్లు అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారిక నంబర్ నుంచి మాత్రమే అధికారులతో సంభాషణ జరుగుతుందని పేర్కొన్నారు. అధికారిక నంబర్ నుంచి కాక ఇతర నంబర్ల నుంచి ఎటువంటి మెసేజ్‌లు వచ్చిన దానిపై సైబర్ సెల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భార్య ప్రాణం తీసిన భర్త పొరపాటు

- నూనె అనుకుని దీపానికి పెట్రోల్
- బాటిల్ బయటకు విసిరేయడంతో అంటుకున్న చీర
- వళ్లు కాలి మహిళా రైతు మృతి

కురబలకోట: దేవుని పటం వద్ద దీపాన్ని వెలిగించడానికి నూనె అనుకుని పొరపాటున బాటిల్‌లో ఉన్న పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఊహించని రీతిలో ప్రమాద వశాత్తు మహిళా రైతు రమణమ్మ (62) మృతి చెందిన విచారకర సంఘటన అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు ముదివేడు ఎస్‌ఐ మల్లిఖార్జున రెడ్డికి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు..మండలంలోని దిగువ చెన్నామర్రికి చెందిన కె. నారాయణరెడ్డి గత శుక్రవారం ఉదయం ఇంట్లో దేవుని పటం ముందు దీపం వెలిగించాడు. నూనె తక్కువగా ఉండడంతో పక్కనే బాటిల్‌లో ఉన్నది నూనె అనుకుని దీపంలో పోశాడు. అది పెట్రోల్ కావడంతో ఒక్కసారిగా భగ్గుమని అంటుకుంది. ఊహించని ఈ హఠాత్ పరిణామంతో రైతు నారాయణ రెడ్డి మండుతున్న బాటిల్‌ను ఒక్కసారిగా ఇంటి బయటకు విసిరేశాడు.



రమణమ్మ (ఫైల్)

అదే సమయంలో ఇంటి బయట చెత్త ఊడుస్తున్న అతని భార్య కె. రమణమ్మ కాళ్ల వద్ద పడటంతో చీర అంటుకుని వళ్లుకాలింది. అక్కడున్న వారు హుటాహుటిన మంటలను ఆర్పివేశారు. కాలిన గాయాలతో ఉన్న రమణమ్మను బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతోంది. కోలుకుంటున్నదని భావించారు. గురువారం ఒక్కసారిగా ఆరోగ్యం విషమించింది. అదే రోజు సాయంత్రం ఉన్నట్టుండి మృతి చెందారు. భర్త దీపం అంటించడానికి నూనె అనుకుని పొరపాటున పెట్రోల్ పోయడం అది కాస్తా ఇంటి బయట ఉన్న మహిళా రైతుకు అంటుకోవడం ఆమె చనిపోవడం విషాదాన్ని నింపింది. క్షణాల వ్యవధిలో జరిగిన ఈ ప్రమాదకర సంఘటన పట్ల అంతటా విచారం వ్యక్తమవుతోంది. టమాటా పంటకు పురుగుల మందు కొట్టే మిషన్‌కు బాటిల్‌లో పెట్రోల్ తెచ్చి ఇంటిలో పెట్టారు. అదే దీపం నూనె అనుకుని ఓ ప్రాణం పోవడానికి దారి తీయడం కలవరానికి గురి చేస్తోంది. కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్‌ఐ గురువారం రాత్రి తెలిపారు.

### రాయితీపై బియ్యం, కందిపప్పు పంపిణీ

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణంలోని రైతు బజార్‌లో రాయితీపై కందిపప్పు, బియ్యం అందిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం రాయచోటిలోని రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్లో చిరువ్యాపారులు (రోడ్లపై తోపుడు బండ్లు వంటి వారు), టీ కొట్టు పెట్టుకొనే వారు, చిల్లర కొట్టు వ్యాపారులు, డ్రైఫ్రూట్స్, టైలరింగ్ షాపులు, ఇతర చిరువ్యాపారులు ఇక్కడే నిర్వహించుకొనే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నామమాత్రపు అద్దెను చెల్లించి వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని చెప్పారు, ఆసక్తి కలిగిన వారు రాయచోటి మార్కెట్ యార్డులోని మార్కెటింగ్ శాఖ అధికారి వారి కార్యాలయానికి వెళ్లి సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగస్వామి, మార్కెట్‌శాఖ ఏడీ త్యాగరాజు, డీఎస్‌ఓ రఘురాం, జిల్లా మేనేజర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

## క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాయచోటి అర్బన్: క్షయరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ,సహకారాలను అందివ్వాలని రాష్ట్ర టీబీసెల్ ఏపీఓ రవీంద్రకుమార్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ శైలజ పిలుపునిచ్చారు. గురువారం శిబ్యాల గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులో వాండ్లపల్లె, ముష్టిమాకులపల్లెలో అడల్ట్ బీసీజీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమంలో అందరూ పాల్గొని క్షయవ్యాధిలేని భారతదేశం కోసం కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో టిబి సూపర్‌వైజర్ నగేష్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విశ్వనాథ రెడ్డి, సిబ్బంది శిరీష, సరస్వతి,అంజనమ్మ, జ్యోతి, రెడ్డెమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి

రాయచోటి అర్బన్: జనాభాను నియంత్రించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలోవైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఆడపిల్లల వివాహ వయస్సు కనీసం 21 సంవత్సరాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, డీసీహెచ్‌ఓ డాక్టర్ డేవిడ్ సుకుమార్, రాయచోటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిలు పాల్గొన్నారు.



రాయచోటిలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

**పండ్ల మొక్కల నిర్వహణ పనులు పక్కాగా అమలవ్వాలి**

చిన్నమండెం: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద రైతుల పొలాల్లో నాటే పండ్ల మొక్కల నిర్వహణ పనులు పక్కాగా అమలవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం డ్వామా ఆధ్వర్యంలో చిన్నమండెం మండలం మల్లూరు గ్రామం బలిజపల్లెలో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్న కారు రైతుల పొలాల్లో నాటే పండ్ల మొక్కల నిర్వహణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నమండెం మండలం మల్లూరు గ్రామంలో మామిడి తోట కోసం ఏర్పాటు చేసిన భూమిలో మామిడి మొక్కను నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వీలైనంత ఎక్కువ మంది రైతులకు ఈ పథకం చేరేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ మద్దిలేటిని ఆదేశించారు.

**ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి**

రాయచోటి: జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్ని ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి, ఎంత ఇసుక ఉంది, నూతన ఇసుక విధానం ఏమిటి, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏమేం చర్యలు తీసుకున్నారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం టన్ను ఇసుక ధర ఒక్కో రీచ్ పరిధిలో స్టాక్ పాయింట్‌కు ఒక్కో ధరను నిర్ణయించిందన్నారు. నిర్ణయించిన టన్ను ధరకు రవాణా చార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులపై రెవెన్యూ, పోలీస్, స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేయాలని ఆదేశించారు.

## క్లుప్తంగా

### ముగ్గురి ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వాల్మీకిపురం మండలం కూరపర్తి పంచాయతీ గంగాదొడ్డి గ్రామానికి చెందిన రామస్వామి భార్య ఓ.హేమావతి(38) కుటుంబ సమస్యలతో బుధవారం రాత్రి ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పీటీఎం మండలం కృష్ణాపురానికి చెందిన బి.సుజాతమ్మ(43) కుటుంబ సమస్యలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా కురబలకోట మండలం అంగళ్లు కడపరోడ్డులోని లక్ష్మీ నగర్‌లో నివాసముంటున్న అంజప్ప భార్య టి.రమాదేవి (37) అనారోగ్య కారణాలతో గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

**మదనపల్లె :** అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకకు చెందిన అన్నదమ్ములు మల్లి కార్జున, మునిరాజ బుధవారం రాత్రి ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తున్నారు. చీకలబైలు చెక్‌పోస్టు వద్ద పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. నిందితుల నుంచి 102 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

### యాసిడ్ తాగి వ్యక్తి మృతి

**మదనపల్లె :** అనారోగ్యంతో బాధ పడుతూ యాసిడ్ తాగి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మరణించిన సంఘటన గురువారం జరిగింది. ములకలచెరువు మండలం వేపూరికోటకు చెందిన వీరప్ప కుమారుడు వెంకటరమణ(52) గత ఆరేళ్లుగా ఆయాసం, ఉబ్బసం వ్యాధులతో బాధపడుతున్నాడు. పలుచోట్ల చికిత్స పొందాడు. బుధవారం మానసిక ఆవేదనతో ఇంట్లో బాత్ రూమ్‌లు శుభ్రపరిచే యాసిడ్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు మదనపల్లె ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు రోహిత్ కుమార్, కుమార్తె పావని ఉన్నారు. కుమారుడు రోహిత్‌కుమార్ ఫిర్యాదుమేరకు ములకలచెరువు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

**చెన్నూరు :** చెన్నూరు టౌన్ రాజుల కాలనీ, అలాగే పెట్రోల్ బంక్ ఎదురుగా వేర్వేరు గోదాముల్లో నిల్వ ఉంచిన 400 బస్తాల పీడీఎస్ బియ్యం సీజ్ చేసినట్లు సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. కాటం వీరబ్రహ్మయ్య, కల్లూరు ఓబుళరెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ చౌక బియ్యం రవాణా చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# విత్తన చట్టంతో.. మోసాలకు కళ్లెం

- ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో లెసెన్స్ ప్రదర్శన తప్పనిసరి
- దుకాణం ఎదుట ధరల సమాచారం ఉండాల్సిందే
- ప్రతి కొనుగోలు దారుడికి బిల్లులు ఇవ్వాల్సిందే
- అన్ని చట్టాలు ఉన్నా అమలుకాని నిబంధనలు

**నకిలీ పంట ఉత్పత్తులు విక్రయిస్తే చట్టం ప్రకారం చర్యలు చేపడతామని ప్రభుత్వం హెచ్చరిస్తున్నా.. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ప్రైవేట్ దుకాణాల్లో నకిలీ ఎరువులు, విత్తనాలు సీజ్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. విత్తన సంచిపై తయారీ స్థలం, కంపెనీ, ఫోన్‌నెంబర్, లాట్, బ్యాచ్ నెంబర్, గడువు, జన్యు స్వచ్ఛత, మొలకశాతం లేకుండానే విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల నిస్సహాయతను ఆసరాగా తీసుకొని నకిలీవి అంటగడుతున్నారు.**

**గుర్రంకొండ :** జిల్లాలో సుమారు 484 ప్రైవేట్ డీలర్లు ఎరువుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. వాటిలో 187 మంది విత్తన విక్రయ డీలర్లు కాగా, మిగిలిన దుకాణాల్లో ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తున్నారు. దుకాణాల ఎదుట ఎరువు, విత్తన ధరలు, స్టాకు సమాచారం ఉండడం లేదు. అధికారుల ఎదుట తాము బిల్లులు, రసీదులు ఇస్తున్నామని కుంటి సాకులు చెబుతున్నారే గానీ.. రసీదు ఇవ్వడం లేదు. అవగాహన లేక సంచిపై క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయడం లేదు. దీంతో బస్తా, ప్యాకెట్లపై లేబుల్ లేకుండా రైతు డీలర్ వద్ద కొనేస్తున్నారు. నష్టపోయిన అనంతరం ఆధారాలు లేక లబోదిబోమంటున్నారు.

**డీలర్లపై కఠిన చర్యలకు చట్టం**

విత్తనాలు, కొనుగోలు సమయంలో రైతుకు ఎలాంటి అన్యాయం జరిగినా విత్తన చట్టం ద్వారా డీలర్లపై కఠిన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం–1966, విత్తన నిబంధనలు–1968, విత్తన నియంత్రణ చట్టం–1983 ఆధారంగా అతిక్రమణ, ఉల్లంఘనలు వర్తించేలా చట్టాన్ని రూపొందించారు. విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్–3 కింద నిబంధన ఉల్లంఘనకు పాల్పడిన వారి దుకాణాలు జప్తు చేయడంతోపాటు అత్యవసర సరకుల చట్టం –1955 సెక్షన్–ఎ ప్రకారం జరిమానా విధిస్తారు.

**విత్తన లైసెన్సులు ప్రదర్శించాలంతే..**

నిబంధనల ప్రకారం లైసెన్సులు ప్రదర్శించాలి. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ అవి లేని వారికి తాఖీదులిచ్చి సరైన సమాధానం ఇవ్వకపోతే విత్తన నియంత్రణ చట్టం 1986 క్లాజ్–5 ప్రకారం డీలర్ లైసెన్సు రద్దు చేయడానికి, సస్పెండ్ చేసేందుకు అవకాశం ఉంది. విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్–8 ప్రకారం ఆయా దుకాణాల్లో విక్రయాలు నిలిపివేయవచ్చు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా డీలర్లు రసీదు ఇవ్వాల్సి ఉంటుంది. రసీదు ఇవ్వని పక్షంలో విత్తన నియంత్రణ ఉత్తర్వులు–1983 క్లాజ్–9 ప్రకారం డీలర్‌కు తాఖీదు ఇచ్చి సమాధానం చెప్పకపోతే లైసెన్సు రద్దు చేయవచ్చు. ప్రైవేట్ విత్తన దుకాణాల వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన ఎరువు బస్తాలకు కంపెనీ లేబుల్స్ లేకున్నా..విత్తన చట్టం 1966 సెక్షన్–7 ప్రకారం జరిమానా విధిస్తారు. కాలం చెల్లిన విత్తనం విక్రయిస్తే విత్తన చట్టం 1966సెక్షన్–7 ప్రకారం విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 క్లాజ్–8ను అనుసరించి డీలర్ లైసెన్సు రద్దు చేస్తారు. అయితే ఇవేవీ చట్టం ప్రకారం జరగడం లేదు.

**షరా మామూలే**

గత పది హేను రోజుల్లో విడతల వారీగా అధికారులు ఎరువులు, విత్తన దుకాణాలపై దాడులు చేస్తూనే ఉన్నా డీలర్ల పరిస్థితి షరా మామూలే అన్న విధంగా మారింది. అధికారులు దాడులు చేయడంతో చిన్న కేసులు నమోదు చేయడంతో ఎలాంటి నష్టం లేదన్నట్లు కొందరు డీలర్లు వ్యవహరిస్తున్నారు. మదనపల్లె డివిజన్‌లో అత్యధికంగా 14 ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.24,13,658 విలువ చేసే ఎరువులు, విత్తనం విక్రయించరాదంటూ సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. అయినా డీలర్లలో మార్పు లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు శాంపిల్‌గా ఒక విత్తన ప్యాకెట్, ఒక రకం బస్తా ఎరువు చూపి స్టాకు ఇచ్చే సమయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నాసిరకం విత్తనం రైతులకు అంటగట్టి చేతులు దులుపుకొంటున్నారు.




గుర్రంకొండలో ఎరువుల దుకాణం ఎదుట ధరలు, స్టాకు వివరాలు లేని సమాచార బోర్డులు

**నిబంధనలు పాటించాల్సిందే**



ప్రభుత్వం రూపొందించిన విత్తన చట్టానికి అనుగుణంగా ప్రైవేట్ విత్తన దుకాణాల డీలర్లు విక్రయాలు చేపట్టాలి. దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలి. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాతోపాటు దుకాణాల లైసెన్సు రద్దు చేసే అధికారం మాకు ఉంది. – వాణీశ్రీ, ఏడీఏ, వాల్మీకిపురం

### నాటుసారా విక్రేత అరెస్ట్

**మదనపల్లె :** అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్‌ఐ లోకేష్ రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లె సమీపంలో వెంకటరాయప్ప కుమారుడు పి.సుధాకర్(45) సారా అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో గురువారం పోలీసులు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### 11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



అటవీ అధికారులు పట్టుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

**సుండుపల్లె :** అక్రమంగా తరలిస్తున్న 11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో ముదుంపాడు బీటు కొండలతూర్పు ప్రదేశంలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం రావడంతో టాస్క్ ఫోర్స్, సానిపాయి అటవీ సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. ఎనిమిది మంది నిందితులను పట్టుకుని వారి నుంచి 11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రెండు ఇసుక టిప్పర్లు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

**నిమ్మనపల్లె :** మండల పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై లోకేష్ రెడ్డి తెలిపారు. కొద్దిరోజులుగా టిప్పర్ల ద్వారా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మదనపల్లెకు అక్రమంగా ఇసుక తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. బోడిబండ సమీపంలోని కట్టువ కాలువ నుంచి సుమారు 40 టన్నుల ఇసుక తరలిస్తూ రెండు టిప్పర్లు పట్టుబడ్డాయన్నారు. టిపర్ డైవర్లు వన్నూరు సాబ్ గుట్ట, కేశం మధు కుమార్, మండెం ఓబులేసు, వాహన యజమానులు అమర్నాథ్, మణిలపై కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లను తహసీల్దారు బాలాజీ రాజుకు అప్పగించినట్లు తెలిపారు.

# హోరాహోరీగా హాకీ పోటీలు



తలపడుతున్న తమిళనాడు- కర్ణాటక బాలికల జట్లు



తమిళనాడు-పాండిచ్చేరి బాలుర జట్ల హోరాహోరీ

**పులివెందుల టౌన్ :** పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో సౌత్ ఇండియా హాకీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం జూనియర్స్ మహిళా విభాగంలో జరిగిన పోటీల్లో కేరళ-పాండిచ్చేరి జట్లు తలపడగా 0–5 గోల్‌తో కేరళ జట్టు విజయం సాధించింది. కర్ణాటక-తమిళనాడు జట్లు పోటీ పడగా ఇందులో కర్ణాటక జట్టు 3–1 గోల్‌తో విజయం సాధించింది. ఆంధ్ర- తెలంగాణా జట్లు పోటీ పడగా ఏపీ11–0 గోల్‌తో విజయం సాధించింది. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో తమిళనాడు-పాండిచ్చేరి జట్లు పోటీపడగా 7–0 గోల్‌తో తమిళనాడు విజయం సాధించింది. తెలంగాణ-కేరళ జట్లు పోటీ పడగా 3–0 గోల్ తేడాతో తెలంగాణా విజయం సాధించింది. ఏపీ-కర్ణాటక జట్లు పోటీ పడగా కర్ణాటక జట్టు 0–4 గోల్ తేడాతో విజయం సాధించింది.

# విగ్రహాల చోరీ ముఠా అరెస్టు

- ఆలయంలో చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- నలుగురు నిందితులు రిమాండ్ ఖైదీలు

**పెద్దతిప్పసముద్రం :** పంచలోహ విగ్రహాల ముఠా గుట్టును పోలీసులు గురువారం ఛేదించారు. చెరువులో దాచిన రూ.9 లక్షల విలువగల విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రవీంద్రబాబు వివరాల మేరకు.. మండలంలోని కమ్మచెరువు పంచాయతీ గొల్లపల్లిలోని సందేశ్వరస్వామి ఆలయంలో మే నెల 28న గుర్తు తెలియని దుండగులు రూ.9 లక్షల విలువ చేసే విగ్రహాలు, నగదు దోచుకెళ్లిన విషయం పాఠకులకు విదితమే. సంఘటన జరిగిన స్థలంలో వేలిముద్రల ఆధారంగా ఈ చోరీ కేసును ఎస్‌ఐ రవీంద్రబాబు ఛేదించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఎరుకుల శ్రీనివాసులు(35), చాకలిపవన్ (29), ఆవుల రాము(50), ఎరుకుల వెంకటరమణ(47) పొట్టకూటి కోసం కర్నాటక రాష్ట్రం చింతామణి తాలూకా ఎనమలపాడి సమీపంలోని కొర్లపర్తిలో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ ఈ నలుగురు వ్యక్తులు జట్టుగా ఏర్పడి ఇటు ఆంధ్ర, అటు కర్నాటక రాష్ట్రాల్లో జనసంచారం లేని ఆలయాల్లో చాకచక్యంగా చోరీలకు పాల్పడ్డారు. అయితే ఓ చోరీ కేసులో పట్టుబడిన ఈ నిందితులు మదనపల్లి సబ్ జైలులో రిమాండ్ ఖైదీలుగా శిక్ష అనుభవిస్తున్నారు. మండలంలో జరిగిన చోరీ కేసు విచారణలో ఆ రిమాండ్ ఖైదీల వేలిముద్రలు జత కావడంతో న్యాయమూర్తి, సబ్ జైలులోని పోలీసుల అనుమతితో నిందితులను పోలీస్ కస్టడీలోకి తీసుకున్నారు. చోరీ జరిగిన స్థలంతోపాటు అపహరించిన పంచలోహ విగ్రహాలను దాచిన చెరువు వద్దకు వెళ్లి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

# ఐసీఎస్ఈ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ) ఏపీ, తెలంగాణ రీజియన్ కబడ్డీ బాలుర విభాగం టోర్నమెంట్ గురువారం ప్రారంభమైంది. అండర్–14, 17, 19 విభాగాల్లో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌ను యోగి వేమన విశ్వవిద్యాలయం క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి, ఇడుపులపాయ ఆర్‌జేయూకేటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి షంషాద్ బేగం ప్రారంభించారు. డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐసీఎస్ఈ బోర్డు పరిధిలోని వివిధ పాఠశాలల క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కబడ్డీ క్రీడకు కార్పొరేట్ హంగులు రావడంతో క్రేజ్ వచ్చిందన్నారు. డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడ కబడ్డీ నేడు విస్తృత ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కల్నల్ ఎ.శేఖర్, వైస్ ప్రిన్సిపల్ యు.శ్రీనివాసమూర్తి, హెచ్‌ఎం రహంతుల్లా, ఫిజికల్ డైరెక్టర్లు కల్యాణ్, తిరుమలశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

# అంగన్ వాడీలు సమయం పాటించాలి



అంగన్ వాడీలకు పరికరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చిట్వేలి :** అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శశికళ హెచ్చరించారు. స్థానిక ఎంపీపీ సభా భవనంలో జరిగిన ప్రాజెక్టు సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లీ పిల్లల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసే అంగన్ వాడీలు గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలన్నారు. ప్రతి నెల 5వ తేదీన జరిగే ఈసీసీఈ డేలో తల్లిదండ్రులకు పిల్లల అభివృద్ధిని వివరించడమేగాక, కమిటీలు వేసి అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో పోషన్ అభియాన్‌లో భాగంగా మంజూరైన 25 అంగన్ వాడీ కేంద్రాలకు ఆర్‌ఓ వాటర్, నీళ్ల డ్రమ్ము, న్యూట్రిగార్డెన్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, ఎల్‌ఈడీ టీవీలను ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ నాగరాజు, జిల్లా ప్రాజెక్టు సమన్వయ కర్త సైపుల్లా, చిట్వేలి ప్రాజెక్టు సూపర్ వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖారాణి, బీపీపి ధనలక్ష్మీ, అంగన్ వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### పూత దశలో జిప్సం వేయాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

**చిన్నమండెం :** వేరుశనగ పంటకు పూత దశలో ఎకరాకు 200 కిలోల జిప్సం వేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ సూచించారు. చిన్నమండెం మండలం కొత్తపల్లె గ్రామంలోని వేరుశనగ పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిప్సం వేయడంతో కాయ ఔటమ్ పెరగడమేగాక, నూనె శాతం వృద్ధి చెందుతుందన్నారు. అదే విధంగా పొలంలో కలుపు తీసివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఏడీఏ శ్రీలత, చిన్నమండెం ఏఓ గీత, వీఏఏ శివ పాల్గొన్నారు.



# మురికి కాలువలో మృత శిశువు



మురికి కాలువలో మృతశిశువు

**ప్రొద్దుటూరు క్రైం :** పట్టణంలోని టూటౌన్ బైపాస్ రోడ్డులోని మడూరు కాలువలో శిశువు మృతదేహం కన్పించడం కలకలం రేపింది. వాజ్‌పేయ్‌నగర్ సమీపంలోని మురికి కాలువలో మృత శిశువు ఉన్నట్లు ఆ ప్రాంత వాసులు గుర్తించారు. ఈ విషయం అందరికీ తెలియడంతో పెద్ద ఎత్తున గుమికూడారు. సుమారు ఐదు నుంచి ఆరు మాసాల గర్భస్థ శిశువు అయి ఉంటుందని భావిస్తున్నారు. రెండు రోజుల క్రితం మృత శిశువును కాలువలో పడేసి ఉంటారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. విషయం తెలియడంతో మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని బయటికి తీశారు. తర్వాత ఖననం చేసినట్లు తెలిపారు.

# వాహనదారులూ... హెల్మెట్ ధరించండి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** వాహనదారులంతా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరాలని కడప రైల్వేస్టేషన్ మాస్టర్ శేఖర్ కుమార్ పిలుపునిచ్చారు. కడప రైల్వే స్టేషన్‌లో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ వాహనదారుడు తమ ప్రాణాలనే కాకుండా కుటుంబ సంక్షేమాన్ని గుర్తించుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తే ఆ కుటుంబానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. రూల్–167 ప్రకారం రోడ్డు భద్రతకు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమెరా, క్లోజ్డ్ సర్క్యూట్ టెలివిజన్ కెమెరా, స్పీడ్ గన్ వంటి పరికరాలను రోడ్డు భద్రతకు వాడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

### పాత్రికేయుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వండి

**కోటిరెడ్డిసర్కిల్ :** జిల్లాలోని పాత్రికేయుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులో 60 శాతం రాయితీ కల్పించాలని, కడప జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(జాప్) నాయకులు కోరారు. కడప కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్‌ను గురువారం కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాత్రికేయుల కుటుంబాలకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాప్ స్టేట్ జనరల్ సెక్రెటరి ఆర్.వి. సూర్యనారాయణ రెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్లు, మామిడి ఎల్లారెడ్డి, భరత్ రెడ్డి, ఎం నాగేష్, సభ్యులు పాల్గొన్నారు.

### నల్లమల అడవిలో కూంబింగ్

**మైదుకూరు :** వనిపెంట అటవీ రేంజ్ పరిధిలో గురువారం అధికారులు కూంబింగ్ నిర్వహించారు. ఎర్రచందనం చెట్లు ఉన్న ప్రదేశాల్లో, వనిపెంట–రుద్రవరం రేంజ్, వనిపెంట–పోరుమామిళ్ల రేంజ్ సరిహద్దు వరకు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి కూంబింగ్ నిర్వహించారు. ఎర్రచందనం చెట్ల నరికివేత, అక్రమ రవాణా ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదని సిబ్బంది తెలిపారు. వనిపెంట రేంజ్ అధికారి ప్రణీత్‌రావు మాట్లాడుతూ వనిపెంట రేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారమైనా వెంటనే తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచడమేగాక, వారికి నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు. అన్వర్ హుస్సేన్, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

# ఆ కార్యాలయంలో ఆయనదే హవా

- అధికారుల చేతికి మట్టి అంటకుండా అక్రమవసూళ్లు
- అన్నీ తానై వ్యవహారాలు చక్కబెడుతున్న వైనం

**మండల రెవెన్యూ కార్యాలయంలో...గతంలో ఉప తహసీల్దారుగా పనిచేసిన ఓ విశ్రాంత అధికారి పౌరసరఫరాల విభాగంలో నేడు చక్రం తిప్పుతున్నాడు. అధికారుల చేతికి మట్టి అంటకుండా, రెవెన్యూ శాఖలో జరిగే వ్యవహారాలు అన్నింటిలోనూ ఆయనే మూడో కంటికి తెలియకుండా వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. నగదు చేతులు మారడంతో కార్యాలయంలో అతడి ఆధిపత్యానికి అడ్డే లేకుండా పోయిందనే విమర్శలున్నాయి.**

**మదనపల్లె :** పట్టణంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఓ రెవెన్యూ అధికారి మండలంలోనే గత కొద్ది సంవత్సరాలుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాడు. గతంలోనూ అక్రమాలకు పాల్పడిన ఆయన సస్పెన్షన్‌కు గురయ్యాడు. రెవెన్యూ శాఖలో పౌర సరఫరాల విభాగంపై పట్టు ఉండడంతో అవినీతికి బీజం వేశాడు. విధులపై అవగాహన ఉండడంతో పదవీవిరమణ తర్వాత కూడా తనకున్న పరిచయాలతో చక్రం తిప్పుతున్నాడు. విధులు తెలిసిన సీనియర్ అధికారి కావడంతో అందరూ ఇతడిపై ఆధారపడుతూ వచ్చారు. దీనిని అవకాశంగా మలచుకున్న ఆయన ఇటీవల పాలనా పరమైన వ్యవహారాల్లో తల దూర్చడం మొదలుపెట్టాడు. గతంలో మదనపల్లెలో తహసీల్దార్‌గా పనిచేసిన ఓ అధికారికి కుడిభుజంగా నిలిచి, అన్ని పనులు ఇతడే చక్కబెట్టాడు. ప్రస్తుతం పౌర సరఫరాల అధికారులను మచ్చిక చేసుకుని, రెవెన్యూ అధికారులతో సంబంధాలు పెట్టుకుని స్టోర్ డీలర్లపై అజమాయిషీ చేస్తున్నాడు. ఎక్కడైతే సమస్యలున్నాయో...వాటిని సరిదిద్దే క్రమంలో తన వాళ్లకు మేలు చేస్తున్నాడు.

**అక్రమాలకు బీజం**

మండల కార్యాలయంలో నిషేధిత భూముల తొలగింపు, స్టోర్ కేటాయింపులు, ఎన్‌ఓసీ, కన్వర్షన్, పాసుపుస్తకాలు, వెబ్‌ల్యాండ్ నమోదు...ఇలా ప్రతి పనికీ ఓ ధర కట్టి అధికారులు, ప్రజలకు మధ్య దళారీగా వ్యవహరిస్తున్నాడు. తహసీల్దారుగా ఎవరు వచ్చినా.. వ్యవహారం చక్కబెట్టి మమ అనిపిస్తున్నాడు. మండలంలోని పప్పిరెడ్డిపల్లె స్టోర్‌ను గతంలో శివరాం నిర్వహించాడు. అతడు రాజీనామా చేయడంతో, మరొకరికి బాధ్యతలు అప్పగించారు. ఈ వ్యవహారంలో విశ్రాంత ఉద్యోగి జోక్యం చేసుకుని మూడునెలల క్రితం ఎలాంటి ఉత్తర్వులు లేనప్పటికీ, బినామీ వ్యక్తిచే నిర్వహించడం ఆరంభించారు. ఓ వ్యక్తి మూడు నెలలుగా వాహనంలో బియ్యం పంపిణీ చేయనప్పటికీ అతడి వాహన అద్దె కాజేశారు. వస్తువులను అనధికారికంగా తరలించి బహిరంగ మార్కెట్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ–పాస్ మిషన్‌లో జొన్నలు కేటాయించనప్పటికీ తన దుకాణంలో విక్రయిస్తున్నారు. అనుమతి లేకుండా మరిన్ని చౌకదుకాణాలు ఇతడి ఆధ్వర్యంలోనే నడుస్తున్నట్లు సమాచారం. చౌకదుకాణాల డీలర్లు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ, అధికారులతో అతడికి ఉన్న పరిచయాలతో వారు మిన్నకుండిపోతున్నారు. తహసీల్దార్ రమాదేవిని ఈ విషయమై వివరణకోరగా అవినీతిని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించేది లేదన్నారు. చౌకదుకాణాలను బినామీ వ్యక్తులు నిర్వహిస్తున్న విషయంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.



మదనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయం